క్లుప్తంగా

అలరించిన నగరి కవితాగానం



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

నగరి: విజయవాడ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో నగరి మండలం, ముడిపల్లి గ్రామం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు దేశిరాజు చంద్రశేఖర్ ప్రతిభ కనబరిచారు. ఈ కవి సమ్మేళనంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై కవితాగానం చేయగా అందరినీ అలరించింది. ఈ కవిత రచనకు గాను పర్యావరణ కవి అనే బిరుదుతో నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. ఉత్తమ పర్యావరణ కవి బిరుదు పొందిన ఉపాధ్యాయుడిని స్థానిక ఎంఈఓలు, ఉపాధ్యాయులు అభినందించారు.

యూటీఎఫ్ ప్రచార జాతా



ప్రచారజాతాలో యూటీఎఫ్ నేతలు

నగరి: యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా వచ్చే ఏడాది జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక సభను పురస్కరించుకుని ఆదివారం ప్రచార జాతా నిర్వహించారు. స్థానిక యూటీఎఫ్ నేతలు ఓంశక్తి ఆలయం వద్ద నుంచి పీసీఎన్ ప్రభుత్వ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అందరూ విద్యావైజ్ఞానిక సభలకు హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరి డివిజన్ పరిధిలోని నగరి, విజయపురం, నింద్ర, కార్వేటినగరం, ఎస్ఆర్ పురం, పాలసముద్రం మండలాల్లోని యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకటేశులు



పాలసముద్రం: భారతీయ జనతా పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా వెంకటేశులుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని జీడీ నెల్లూరు అసెంబ్లీ కన్వీనర్ రాజేంద్రన్ తెలిపారు. ఆదివారం మండల నూతన బూత్ కమిటీని నియమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నగరి: ఎన్నికల సందర్భంగా కార్మిక వర్గానికి కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగ సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరి పట్టణంలో ఏఐటీయూసీ నాయకురాలు ప్రభావతి అధ్యక్షతన జరిగిన జిల్లా సమితి సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ముందుగా అంగన్‌వాడీ సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను, ఆశా కార్మికులకు జీతాలు పెంచుతామని ప్రకటించిన హామీలపై కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదన్నారు. కార్మిక వర్గాన్ని నిరాశపరుస్తూ కనీస వేతనాలు అమలు పరచకుండా నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ సమస్యలు పరిష్కరించకుండా కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్నాయన్నారు. అలాగే రైతులపై కేంద్ర ప్రభుత్వం జరిపిన దాష్టీకాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించడంలో ఏఐటీయూసీ ముందుండాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలైన ఉత్పత్తులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలసముద్రం: రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏఎంఎంటీ గంగరత్న, డీఎంఎంటీ ధనలక్ష్మి తెలిపారు. ఆదివారం శ్రీకావేరిరాజుపురం ఆదిఆంధ్రవాడ సమీపంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా (ఏటీఎం) వెజిటబుల్ మోడల్ సాగుపై ఎంటీ ప్రతాప్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఎంఎంటీ గంగరత్న మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగం లక్ష్యం రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగం తగ్గించడమేనన్నారు. ఘన, ద్రవ కషాయాల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మహిళా రైతులు పుష్ప, నిర్మల, మునియమ్మ పాల్గొన్నారు.

బాల్యం.. మత్తుమయం



- మైనర్ల చేతిలో మద్యం సీసాలు
- సరదాగా మొదలై.... అనారోగ్యం పాలు
- కుమిలిపోతున్న తల్లిదండ్రులు
- ఎస్సీ కాలనీల్లో విరివిగా బెల్టు షాపులు



పన్నూరు సబ్‌స్టేషన్‌లో మద్యం షాపు పక్కన బార్‌ను తలపిస్తున్న దాబా

విజయపురం: మద్యం మహమ్మారి చిన్నాపెద్ద తేడా లేకుండా అందరినీ దెబ్బతీస్తోంది. దానికి ప్రధాన కారణంగా మద్యం విచ్చలవిడి కావడం. మనదేశంలో తాగే వారి సగటు వయసు కాల క్రమేణా 28 నుంచి 14 సంవత్సరాలకు పడిపోయినట్లు తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఒకప్పుడు ఎక్కడో నగరం, పట్టణాల్లో కనిపించే మందు సీసాలు ఇప్పుడు ప్రతి గల్లీలో కనిపిస్తున్నాయి. దీంతో పదో తరగతి వయసు... అంతకంటే తక్కువ నుంచే మద్యపానంపై ఆసక్తి చూపుతున్నారు. 1980లో మద్యం తాగేవారి సగటు వయసు 28 సంవత్సరాలు ఉంటే... అది 2007 నాటికి 20కి తగ్గింది. ప్రస్తుతం టీనేజ్‌లోకి ప్రవేశిస్తూనే చాలామంది యువత దురలవాట్ల వైపు అడుగులేస్తున్నారు. సామాజికంగా, ఆరోగ్యపరంగా వ్యక్తులపై మాత్రమే కాదు.... ఈ ప్రభావం కుటుంబాల పైనా పడుతోంది. పిల్లల భవిష్యత్తును తలచుకుని తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు.

నిబంధనలు బేఖాతరు

నగరంలో అధిక శాతం మద్యం దుకాణాలు, బార్లు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నాయి. వాస్తవానికి మైనర్లకు మద్యం అమ్మడం, సరఫరా చేయడం నేరం. అమ్మకందారులకు వయసుపై అనుమానం వస్తే ఏదైనా రుజువు చూపమని అడగాలి. మైనర్ కాదని స్పష్టమైతేనే తప్ప మద్యం విక్రయించకూడదు. కానీ 16 ఏళ్ల పిల్లలు వెళ్లినా... మద్యం అమ్ముతున్నట్లు ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో అత్యధికులు చిరుప్రాయంలోనే మద్యం కొనుక్కొని తాగుతున్నారు. సరదాగా ప్రారంభమయ్యే ఈ అలవాటుకు క్రమేపీ బానిసలుగా మారుతున్నారు.

ఎక్కడ పడితే అక్కడ దొరకడంతో...

తాగడం అనేది ఇటీవల కాలంలో లెక్కలు చూస్తే ఇప్పుడు కొంత ఎక్కువైనట్టుంది. ఇది కూడా భవిష్యత్‌లో ప్రమాదకరమే. ప్రతి ఊరులో అనుకూలంగా బెల్ట్ షాపులు, ఎక్కడ పడితే అక్కడ వైన్ షాపులు ఉంటున్నాయి. ఇందుకు తోడు అమ్మకాలు పెంచుకోవడానికి మద్యం దుకాణదారులు సిండికేట్‌గా మారి ప్రతి పల్లెల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. విపరీతంగా తాగడం వల్ల రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు జరుగుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ సరుకు అందుబాటులో ఉండడంతో యువకులు మద్యానికి ఆకర్షితులవుతున్నారు.

సరదాగా మొదలై...

తొలుత స్నేహితులతో సరదాగా బీరు పార్టీలతో ప్రారంభిస్తున్నారు. వారానికి ఒకసారి జరిగే ఈ పార్టీల తర్వాత ... క్రమంగా కుదిరితే రోజూ పార్టీలు లేదా ఎవరికి వారుగా తాగడానికి అలవాటుపడుతున్నారు. డబ్బుల కోసం కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేయడం.. గొడవలు పెట్టుకోవడం... దొంగతనాలు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారు. నగరంలో రోడ్డు ప్రమాదాలకు, ఇటీవల చోటు చేసుకొంటున్న పలు రకాల నేరాలకూ మద్యపానం ఒక ప్రధాన కారణం. చిన్న వయసులోనే మద్యపానం, గుట్కా, పాన్‌మసాలా, ధూమపానానికి అలవాటు పడుతున్నారు. దీన్ని ఆరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

బార్లను తలపిస్తున్న దాబాలు

మద్యం షాపు పక్కన ఉన్న దాబాలు బార్లను తలపిస్తున్నాయి. ఉదయం 6గంటల నుంచి 10 గంటల వరకు, అలాగే రాత్రి 10 నుంచి 12గంటల వరకు దాబాల్లో మద్యం విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం మద్యం షాపు పక్కన ఎలాంటి దాబాలు నిర్వహించకూడదు. ఇది తెలిసినా.. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల దాబాలో ఫుల్‌గా మద్యం తాగి ఇరు వర్గాలకు చెందిన యువకులు కొట్టుకొని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయినా అధికారులే ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

చిన్న జంబాడలో అపరిశుభ్రత



ఫ్యాక్టరీ నుంచి వెలువడిన కలుషిత నీరు

విజయపురం: చిన్న జంబాడలో ఉన్న ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కలుషిత నీరు, వ్యర్థాలు పలు గ్రామాలకు శాపంగా మారాయి. పరిశ్రమ నుంచి వెలువడుతున్న కలుషిత నీటి నుంచి దుర్వాసనతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విజయపురం మండలం పరిధిలోని చిన్న జంబాడ గ్రామంలో జంబాడ–కనకమ్మసత్రం రహదారి పక్కనే ఓ ఫ్యాక్టరీ ఉంది. ఈ పరిశ్రమ నుంచి వచ్చే కలుషిత నీటిని, వ్యర్థాలను సమీపంలో ఉండే నీటిలోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ రసాయనిక జలాలను శుద్ధి చేసి బయటకు వదలాల్సి ఉంటుంది. కానీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఆ నీరు సమీపంలోని వ్యవసాయ పొలాలు, కాలువల్లో వదిలి పెడుతున్నారు. ఆ నీటిని తాగిన మూగ జీవాలు వ్యాధుల బారిన పడుతున్నాయి. అలాగే సమీపంలోని పంట పొలాలు కూడా నాశనమయ్యాయి. దీంతో పంటలు సరిగా పండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

క్రీడా మణిహారాలు

- విద్యతోపాటు క్రీడల్లో రాణింపు
- రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

నింద్ర: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వివిధ ఆటల పోటీల్లో రాణిస్తూ క్రీడా దీపాలుగా వెలుగొందుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల పోటీల్లో తమ సత్తా చాటుతున్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి చదివే విద్యార్థి జి.రోహిత్ గాంధీ ఎంపికయ్యాడు. పుత్తూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని సత్తా చాటాడు. అందులో ప్రతిభ కనబరిచిన జి.రోహిత్ గాంధీ నవంబరు 9వ తేదీ నుండి బాపట్లలో నిర్వహించిన అండర్–14 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అక్కడ కూడా తన ప్రతిభ చాటాడు. రాష్ట్ర స్థాయి అండర్ నెట్ బాల్ పోటీలకు నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి చదివే విద్యార్థిని కె.మోనిషా ఎంపికైంది. జిల్లా స్థాయి పోటీలను నగరి ఏకాంబరకుప్పంలో నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరచిన మోనిషా అనంతరం వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని విజయం సాధించింది.

ఆటల పోటీల్లో మేటి

మండలంలోనే కాకుండా నింద్ర హైస్కూల్ విద్యార్థులు నియోజకవర్గంలో ప్రతిభ కనబరచి రాణిస్తున్నారు. చిత్తూరు, మదనపల్లె, తిరుపతిలో వివిధ రకాల పోటీల్లో పాల్గొని విజయాలు సాధించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న మాధవి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో రాణించి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయి పోటీలలో విశేష ప్రతిభ కనబరిచింది. అదే విధంగా 10వ తరగతి చదివే పృథ్వీకుమారి జిల్లా స్థాయిలో విజయం సాధించి పాఠశాల ప్రతిష్ట నిలబెట్టింది.

క్రీడలపై ఆసక్తి ఉండాలి



“ మా పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపుతున్నారు. విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయసహకారాలు అందించడం మాకు ఎంతో ఆనందంగా వుంది. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణిస్తుండడంతో మా కృషికి తగిన ఫలితం దక్కినట్టయింది. అలాంటి విద్యార్థులు మా పాఠశాలలో ఉన్నందుకు మాకు గర్వంగా ఉంది. క్రీడా రంగంలో విద్యార్థులను పోత్సహించడం మా కర్తవ్యం.

– సుబ్రమణ్యం, వ్యాయామ ఉపాధ్యాయుడు, నింద్ర

ఉత్సాహంగా పాల్గొంటున్నారు

మా పాఠశాలలో చదివే విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటున్నారు. పలు ఆటలలో విజయం సాధించడం మాకు గర్వంగా ఉంది. విద్యార్థుల విజయానికి సంబంధిత ఉపాధ్యాయుల కృషి కూడా ఎంతో ఉంది. విద్యార్థుల ప్రతిభతో పాఠశాలకు జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు వచ్చింది. రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో రాణించడం ఎంతో సంతోషంగా ఉంది.

– శివయ్య, ప్రధానోపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నింద్ర

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పెనుమూరు పాఠశాలలో పూర్వ విద్యార్థులు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకుంటూ పాఠశాల ఆవరణలో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో తిరుపతి శిల్పారామంలో పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారన్నారు. అప్పటి నుంచి పూర్వ విద్యార్థుల్లో ఎవ్వరికి కష్టం వచ్చినా ఆర్థికంగా ఆదుకుంటున్నట్టు తెలిపారు. ఈ సారి ఓ పూర్వ విద్యార్థి ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పూర్వ విద్యార్థులు ఒకటి కావడానికి ఎంతో కృషి చేసిన కంచెర్ల మమతను అభినందించారు.ఈ కార్యక్రమంలో కామసాని విజయకుమార్‌రెడ్డి, గంధం ముని, కిషోర్, శ్రీనాథ్, ధనలక్ష్మి, శ్రీనివాసులు, మాధవి, గిరి తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని ముక్కలతూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేటు హోటల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో కలిశారు. చిత్తూరు నగరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 2002–03 సంవత్సరంలో తమ గురువులు పద్మనాభ పిళ్లై, కుప్పారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చక్రధరరావు, సునీల్ కుమార్, శాంతి, నాగలక్ష్మి, శ్రీదేవిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ముక్కలతూరు జడ్పీ హైస్కూల్‌లో త్వరలో సరస్వతి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మూర్తి, లత, పవిత్ర, ప్రసాద్ బాబు, హరిత, కుమారి, సారథి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



వెంకటరత్నం దంపతులకు సన్మాన కార్యక్రమం

కార్వేటినగరం: మండల పరిధిలోని గంగమాంబాపురం ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకటరత్నం ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. సన్మాన సభలో పాల్గొన్న జిల్లా ఏపీటీఎఫ్ 1938 అధ్యక్షుడు కిరణ్‌కుమార్, గంగమాంబాపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాబు ఉపాధ్యాయుడు వెంకటరత్నంను అభినందించారు. ఆ దంపతులను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. భూపతి, చిరంజీవి, గుణశేఖర్, విశ్వనాథనాయుడు, ప్రకాష్, జగన్నాథం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

వెదురుకుప్పం: వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని కార్వేటినగరం ఖండ కన్వీనర్ రోశయ్య అన్నారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేసి మైక్ ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు. అనంతరం రోశయ్య మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం హైందవ శంఖారావాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి హిందువు భాగస్వామియై పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం సహ కన్వీనర్ రోహిత్‌రాజు, జిల్లా మోర్చ ప్రధాన కార్యదర్శి శేషాద్రికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు విశ్వనాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలాజీ రెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

ధనుర్మాసం.. భక్తి పారవశ్యం



కీళపట్టు వీధుల్లో భజనలు



శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పాశురాలు పఠిస్తున్న భక్తులు



నగరి పట్టణంలో కరియమాణిక్య స్వామి ఆలయ మాడవీధుల్లో భజనలు

నగరి: ధనుర్మాసం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాడ వీధుల్లో వేకువజామున 4 గంటల నుంచే భజనలు, కీర్తనలతో ఆధ్యాత్మిక భావం చోటుచేసుకుంటోంది. టీటీడీ ఆధీనంలోని శ్రీభూదేవి, శ్రీదేవి సమేత కరిమాణిక్య స్వామి ఆలయ మాడ వీధుల్లో గోవింద మాల ధరించిన భక్తులు వేకువజామున భజనల్లో నిమగ్నమయ్యారు. కీళపట్టు శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ పరిధిలో మహిళలు, పురుషులు, పిల్లలు ధనుర్మాస పూజల్లో నిమగ్నమయ్యారు. వేకువ జామునే ఆలయ దీపంతో గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి కీర్తనలను పారాయణం చేస్తూ ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. అక్కడ పాశురాలను పఠిస్తూ ఆధ్యాత్మిక ఆనందం పొందుతున్నారు.

కమలమ్మకు ఘన నివాళి



కమలమ్మ మృత దేహానికి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి



నడిపిరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి, నూకతోటి రాజేష్



నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): మండల కేంద్రం పెనుమూరులో వైఎస్ఆర్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ యతీశ్వర్‌నాయుడు తల్లి కమలమ్మ(78) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న వైఎస్ఆర్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జి కళత్తూరు కృపాలక్ష్మి గ్రామానికి వెళ్లి కమలమ్మ మృత దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, లోకనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, ఎంపీటీసీ జమున, సర్పంచ్ నవీన్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, రాఘవులు, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, ఉమాపతి, దాము, భీమా, హేమంత్‌రెడ్డి, ఢిల్లీ, దేవరాజులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో...

శ్రీరంగరాజపురం: మండలంలోని పూళ్లరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త మునెమ్మ(87) అనారోగ్యంతో ఇటీవల మరణించింది. వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి ఆ సమయానికి అందుబాటులో లేకపోవడంతో ఆదివారం మునెమ్మ కర్మక్రియలకు హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత, సర్పంచ్ కుమారి, ఎంపీటీసీ చంద్రశేఖర్, నాయకులు బాబు, జనార్దన్, కాలప్ప, హరిరెడ్డి, మాజీ సచివాలయం కన్వీనర్ వెంకటేష్ మదన్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: వలస నెల్లేపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు అయిలురెడ్డి తండ్రి నడిపి రెడ్డి కర్మ క్రియల కార్యక్రమానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి, చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానంద రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ , సీనియర్ నాయకుడు అనగంటి హరికృష్ణ హాజరయ్యారు. వలస నెల్లేపల్లి గ్రామంలో నడిపిరెడ్డి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వేల్కూరు బాబు రెడ్డి, గురవారెడ్డి, చిన్నమ రెడ్డి, సురేందర్ రెడ్డి, అంబోదరపల్లి బాబు రెడ్డి, అలీ షేర్ ఖాన్, వేల్కూరు కుట్టి, వింజం పంచాయతీ నాయకులు గోవిందన్, ఎంపీటీసీ హనీఫ్ బాషా, దేవన్, సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీరంగరాజపురం నాయకులు మండల కన్వీనర్ మణి ,అనంత్‌రెడ్డి , జనార్దన్, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.